సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 14 । జూలై । 2025



షాడో సర్పంచ్ పెత్తనం

మశాఖపురంలో షాడో సర్పంచ్ పెత్తనం పెరుగుతోంది. ఆయన సంతకాలతోనే పని జరుగుతోంది.

- 8లో



థర్మల్ ఉద్యమం @ 15 ఏళ్లు

జిల థర్మల్ ఉద్యమానికి 15 ఏళ్లవుతోంది. నేడు సంస్మరణ సభ జరగనుంది.

- 8లో

ఫరీదుపేటలో కొనసాగిన పోలీసు పికెట్

ఎచ్చెర్ల: ఫరీదుపేటలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. హత్య కేసుకు సంబంధించి ఇప్పటికే పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డీఎస్పీ వివేకానంద పరిధిలో పదికిపైగా ప్రత్యేక పోలీసుల బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం. డీఎస్పీ వివేకానంద సైతం ఆదివారం విశాఖలో కీలక నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు భోగట్టా. గ్రామాన్ని సీఐ అవతారం, ఎస్ఐ సందీప్ ఆదివారం సందర్శించారు.

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాత బస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

నేడు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు



నరసన్నపేట: గుడివాడ జెడ్పీ చైర్‌పర్సన్‌పై చేసిన దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. పోలీసుల సమక్షంలోనే కూటమి కార్యకర్తలు, నాయకులు హారికపై దురుసుగా ప్రవర్తించారని, ఆమెను తీవ్రంగా అవమాన పరిచారని కృష్ణదాస్ అన్నారు. ఒక మహిళా ప్రతినిధిపై ఈ విధంగా దాడికి పాల్పడటం శోచనీయమని కృష్ణదాస్ పేర్కొన్నారు. దీన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిస్తూ ప్రకటన విడుదల చేశారు.

15న జిల్లాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఈ నెల 15న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో దర్శనం చేసుకుంటారు. అనంతరం శాంతినగర్‌లోని ఏపీటీడబ్ల్యూఏ పాఠశాలను సందర్శించి గిరిజన విద్యార్థులతో ముఖాముఖీ సమావేశం నిర్వహిస్తారు. అక్కడి నుంచి మందస తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆదివాసీ ప్రజలు, రెవెన్యూ అధికారులతో జరగనున్న సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4:45 గంటలకు ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి వెళ్లి, అన్ని కోర్సుల్లో రిజర్వేషన్ల అమలు, ఆదివాసీ విద్యార్థుల సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నారు.

'ఆమెకెందుకు పెద్ద ఫొటో..?'



అరకు ఎంపీ తనూజకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రాన్ని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనూజారాణి తొలిసారిగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. దర్శనానంతరం ఆమెకు ఓ చిన్న జ్ఞాపికను ఆలయం తరఫున అందజేశారు. అయితే అంతకుముందు ఆలయ ప్రొటోకాల్ చూసే ఓ జూనియర్ అసిస్టెంట్ ఎంపీ తనూజను అవమానించేలా ప్రవర్తించాడని ఎంపీ అనుచరులు తెలిపారు. 'ఆమెకెందుకు పెద్ద ఫొటో.. అసలు ఫొటో (జ్ఞాపిక) ఇవ్వాల్సిన అవసరం ఉందా..' అంటూ ఆలయ దినసరి వేతనదారులకు ఆ జూనియర్ అసిస్టెంట్ హుకుం జారీ చేయడంపై ఎంపీ అనుచరులు విస్తుపోయారు. దీనిపై ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాత్రం స్పందించి ఒక పార్లమెంట్ సభ్యురాలికి గౌరవంగా జ్ఞాపిక ఇవ్వకపోవడమేంటని ఆయనే స్వయంగా ఎంపీ తనూజరాణికి జ్ఞాపికను అందజేశారు. ఎంపీ తనూజ వెంట మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, రాష్ట్ర మహిళా వైఎస్సార్ సీపీ కార్యదర్శి టి.కామేశ్వరి తదితరులున్నారు.

'కోట' 35 ఏళ్ల కిందట జిల్లాకు వచ్చారు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ సినీ నటులు కోట శ్రీనివాసరావు 35 ఏళ్ల క్రితం జిల్లాకు వచ్చారని రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి తెలిపారు. సినీ రంగంలోకి రాక మునుపు రణస్థలం మండలం కమ్మసిగడాం గ్రామ మహాలక్ష్మీ అమ్మవారి పేరంటాల యాత్ర జరిగిన సమయంలో నాటక పరిషత్‌లో పాల్గొనేందుకు వచ్చారని తెలిపారు. ఆ సమయంలో తాము చీకటి నాటిక ప్రదర్శన చేశామన్నారు. ఆయనతో కలిసి 'పెళ్లి కోసం' సినిమాలో విలన్‌గా నటించే అవకాశం తనకు దొరికిందని స్వామి వివేకానంద జాతీయ అవార్డు గ్రహీత గురుగుబిల్లి లోకనాథం గుర్తు చేసుకున్నారు.



పీహెచ్‌సీలకు ప్రసవ వేదన

- లక్ష్యానికి బహు దూరంగా ప్రసవాల సంఖ్య
- 66 పీహెచ్‌సీల్లో క్రమేణా తగ్గుతున్న ప్రసవాలు
- రాష్ట్రంలో 20వ స్థానంలో నిలిచిన జిల్లా
- 2024–25లో కేవలం 706 ప్రసవాలే నమోదు

అరసవల్లి: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రసవ వేదన అనుభవిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన పీహెచ్‌సీలు క్రమేణా లక్ష్యాలకు దూరమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 66 పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య రానురాను తగ్గిపోతోంది. దీంతో ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం తగ్గిపోయి జనం ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారనే చర్చ జోరందుకుంది. ఇక పీహెచ్‌సీల్లో ప్రసవాల విషయానికి వస్తే గత వార్షికంతో పోల్చితే 2024–25 వార్షికానికి కేవలం 706 ప్రసవాలే నమోదయ్యాయి. దీంతో రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థానం అట్టడుగు వరుసలో ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

రాష్ట్రంలో 20వ స్థానంలో..

ప్రసవాల సంఖ్య పీహెచ్‌సీల్లో భారీగా పెరగాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించినప్పటికీ అందుకు తగిన ప్రోత్సాహాన్ని, సౌకర్యాలను కల్పించడంలో విఫలం కావడంతో పీహెచ్‌సీల్లో ప్రసవాలకు బాలింతలు, వారి కుటుంబసభ్యులు ఆసక్తి చూపడం లేదు. తాజాగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి జిల్లాల వారీగా నిర్వహించిన సమీక్షలో మన జిల్లాకు ప్రసవాల లక్ష్యాల విషయంలో 20 వ స్థానం లభించింది. దీంతో జిల్లాలో వైద్యారోగ్య శాఖ ప్రగతి పనితీరును ఈ ర్యాంకు ప్రస్ఫుటం చేస్తోంది.

జిల్లాలో కీలకంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్నాయుడు, అచ్చెన్నాయుల సొంత గ్రామం నిమ్మాడలో పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య సున్నాగా నమోదు కావడం గమనార్హం. అత్యధికంగా హిరమండలంలో అత్యధికంగా 57 ప్రసవాలు నమోదయ్యాయి.

నమ్మకం కలిగించడంలో విఫలం..

ప్రతి పీహెచ్‌సీ గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుంది. కొన్ని కేంద్రాలు మాత్రం కనీసం 3 కిలోమీటర్ల గరిష్టదూరంలో ఉన్నాయి. గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చిన 10 నుంచి 20 నిమిషాల్లో పీహెచ్‌సీలకు చేరుకునే అవకాశాలున్న కేంద్రాలు అత్యధికంగానే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేస్తే ఆయా పీహెచ్‌సీలపై నమ్మకం ఉంటుంది. అలాంటిది చాలా పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులున్నప్పటికీ దాదాపుగా అందుబాటులో ఉండని పరిస్థితులే ఎక్కువ. హాజరు వేసుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వారు కొందరుంటే, మరికొందరు ప్రభుత్వ వైద్యంపై మొగ్గ చూపకుండా కాలక్షేపం చేస్తున్న ఘటనలు కోకొల్లలు. తాజాగా సారవకోట మండలం బుడితిలో సిహెచ్‌సిలో ఇద్దరు బాలింతలు ఆపరేషన్ వికటించి మృతి చెందడం జిల్లాలో సంచలనమైన సంగతి విదితమే. ఇలాంటి ఘటనలతో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం సన్నగిల్లుతోంది. దీనికి తోడు ప్రభుత్వ వైద్యం కోసం ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కూడా ఏమీ లేకపోవడంతో జనం ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రసవాలు పెంచేలా చర్యలు



జిల్లాలో అన్ని పీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపడుతున్నాం. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు నిత్యం సూచనలు చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడతాం. ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ కె.అనిత, డీఎంహెచ్‌ఓ

జిల్లాలో ప్రసవాల పరిస్థితి ఇది

పీహెచ్‌సీ	ప్రసవాల సంఖ్య	పీహెచ్‌సీ	ప్రసవాల సంఖ్య
అక్కులపేట	05	కొనుసుల కొత్తూరు	08
అక్కుపల్లి	03	కొర్లాం	08
అచ్యుతాపురం	06	కొత్తపల్లి	02
బైదలాపురం	05	కురిగాం	18
బాతువ	05	ఎల్ఎన్ పేట	16
బట్టిగల్లూరు	05	లావేరు	04
బెలగాం	29	ఎం.ఎస్.పల్లి	13
బొంతు	12	మాకివలస	08
బొరివంక	17	మందస	15
బోరుభద్ర	06	మాణిక్యపురం	09
బుడుంబో కాలనీ	11	మెళియాపుట్టి	50
బూర్జ	04	మురపాక	05
కళింగపట్నం	09	నందిగాం	19
చాపర	15	నిమ్మాడ	00
చొర్లంగి	17	నౌగాం	07
దండుగోపాలపురం	12	నౌపడ	18
దూసి	06	పాతర్లపల్లి	09
ఈదుపురం	15	పోలాకి	06
ఎచ్చెర్ల	12	పొన్నాడ	06
జి.సిగడాం	02	రాజపురం	17
గంగువాడ	08	రావాడ	04
గార	06	రెంటికోట	06
గోవిందపురం	20	సంతబొమ్మాళి	12
గుప్పిడిపేట	04	సారవకోట	10
గుత్తావల్లి	05	సరుబుజ్జిలి	09
హిరమండలం	57	సింగుపురం	05
జలుమూరు	02	సిరిపురం	15
కంచిలి	21	శ్రీకూర్మం	10
కరజాడ	12	సైరిగాం	11
కింతలి	02	తాడివలస	04
కొళిగాం	07	తొగరాం	03
		తిలారు	10
		ఉర్లాం	06
		వజ్రపుకొత్తూరు	14
		వెంకటాపురం	09



చిరిగిపోయిన బెడ్‌ల మీద బెడ్ షీట్‌లు లేకుండా పడుకున్న రోగులు

కొత్తూరు: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నిత్యం సమస్యలు తప్పడం లేదు. ఆదివారం బెడ్

● బెడ్‌షీట్ రూమ్‌కు తాళం!

షీట్‌లు ఉన్న రూమ్‌కు తాళాలు వేసేశారు. సంబంధిత ఉద్యోగి ఆదివారం రాకపోవడంతో తాళాలు తీయలేదు. దీంతో ఆస్పత్రిలో ఉన్న రోగులకు చిరిగిపోయిన బెడ్‌లే గతిగా మారాయి. డయేరియా రోగులు కూడా ఇవే బెడ్ల మీద పడుకున్నారు. బెడ్‌షీట్లు లేకపోతే తర్వాత వచ్చే రోగులకు వ్యాధులు సోకే అవకాశం ఉంటుంది. ఈ విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్ వద్ద ప్రస్తావించగా తాళాలు హెడ్ నర్స్ వద్ద ఉంటాయన్నారు. ఇక నుంచి ఇలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

● విద్యుత్ కోతల మయం

టెక్కలి రూరల్: టెక్కలిలో విద్యుత్ కోతలతో జిల్లా కేంద్రాస్పత్రిలో రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం రాత్రి 7.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు ఆస్పత్రిలో జనరేటర్ వేయకపోవడం వల్ల అటు రోగులు, ప్రసూతి విభాగంలో ఉన్న బాలింతలు, పుట్టిన చిన్న పిల్లలు ఉక్కపోతతో చాలా ఇబ్బంది పడ్డారు. దాదాపు ముప్పై నిమిషాల పాటు ఇదే పరిస్థితి కొనసాగడంతో రోగులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అయినా సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోగులు కేకలు వేయడంతో జనరేటర్ ఆన్ చేశారు.



సెల్ లైట్ వెలుతురులో ఉన్న బాలింతలు, చిన్నపిల్లలు

● ఎందుకింత నిర్లక్ష్యం..?



టెక్కలి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న బ్యాటరీ ట్రై సైకిళ్లు

టెక్కలి: టెక్కలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగుల కోసం తీసుకువచ్చిన బ్యాటరీ ట్రైసైకిళ్లు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. వీటిని ఎప్పుడు పంపిణీ చేస్తారోనని దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు. కొన్ని నెలల కిందట ఓ సంస్థ దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేసి కేటగిరీల వారీగా దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేసింది. అప్పటి నుంచి బ్యాటరీ ట్రైసైకిల్స్ ఇలాగే పడి ఉన్నాయి. ఇవి పూర్తిగా పాడైపోక మునుపే పంపిణీ చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

నారాయణపురం ఆనకట్ట



నారాయణ.. నారాయణ.. సాగునీరు అందేనా..?

- ఆధునికీకరణ లేక అధ్వానంగా కనిపిస్తున్న నారాయణపురం ఆనకట్ట కాలువలు
- శివారుకు నీరు అందడం ప్రశ్నార్థకమే



నారాయణపురం ఆనకట్టలో విడుదల చేసిన నీరు

బూర్జ: నాలుగు మండలాలకు సిరులు పండించే నారాయణపురం ఆనకట్ట గడ్డు దశను ఎదుర్కొంటోంది. బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాలకు సాగునీరు అందించే నారాయణపురం ఎడమ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాభావ పరిస్థితుల వల్ల పొలాల్లో నీరు లేక మెట్ట ప్రాంతాల్లో భూములు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. నారాయణపురం ఆనకట్టకు సంబంధించి 2019 నుంచి 2024 వరకు నారాయణపురం గ్రామం నుంచి తొగరాం గ్రామం వరకు పనులు చేశారు. ఈ మెయిన్ కాలువ నుంచి పిల్లకాలువలు చాలా ఎక్కువ ఉన్నాయి. బూర్జ మండలం కంట్లాం మెయిన్ కాలువ నుంచి ఆమదాలవలస మండలం కుద్దిరాం గ్రామం చెరువు వరకు, అలాగే కొత్తవలస బ్రాంచ్ చానల్ తురకపేట, నెల్లిపర్తి బ్రాంచ్ చానల్ ఎదుళ్లవలస వరకు విస్తరించి ఉంది. కొత్తవలస మీదుగా తొగరాం మెయిన్ చానల్ వరకు ఉంది. బురద బట్టి కొర్లకోట గ్రామం నుంచి కణుగులవలస గ్రామం వరకు విస్తరించి ఉంది. ఇలా ఎడమ ప్రధాన కాలువ నుంచి దిగువ ప్రాంతాలకు అన్ని గ్రామాలు కలుపుతూ పిల్ల కాలువలు నిర్మాణం చేపట్టారు. నారాయణపురం ఎడమ కాలువ ఆయకట్టు నాలుగు మండలాలు కలిపి 18450 కిలోమీటర్ల వరకు ఉంది. శివారు భూములకు కాలువ ద్వారా నీరు అందక భూములు ఎండిపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న షట్టర్లు బాగు చేయాలని కోరుతున్నారు.

త్వరలోనే పూడికలు తీస్తాం..



నారాయణపురం ఎడమ కాలువలో పూడిక తీత పనులు త్వరలో ప్రారంభిస్తాం. రూ. 98 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఖరీఫ్ పంటలకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– టి. రామశివాజి, నారాయణపురం ఎడమ కాలువ ఇన్‌చార్జి ఏఈ

పూర్తి స్థాయిలో సాగునీరు అందజేయాలి



నారాయణపురం ఎడమ కాలువకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేసి ఆయకట్టు భూములకు ఖరీఫ్ పంటలకు సరిపడే విధంగా పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయాలి. ఏటా నీరు రాకపోతుండడంతో నష్టపోతున్నాం. – బొడ్డేపల్లి నాగరాజు గుత్తావల్లి, బూర్జ మండలం రైతు

● గిట్టుబాటు కాని పనస

ఇచ్ఛాపురం: ఉద్దానం వాసులకు పనస గిట్టుబాటు కావడం లేదు. కేవలం రూ.20 నుంచి రూ.60 మాత్రమే పలకడంతో ఉద్దానం రైతులంతా ఉసూరుమంటున్నారు. ఈ పనస పండ్లను ఒడిశాకి చెందిన మధ్యవర్తులు వచ్చి కొనుగోలు చేసి ఒడిశాలోనికి తీసుకెళ్లి లాభాలు గడిస్తున్నారు. ఉద్దానంలో పనస, ఇతర ఉద్యానపంటలకు కూడా ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటిస్తే ఉద్దానం ప్రాంతం రైతులకు కొంత మేలు జరుగుతుందని రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.



మెయిన్‌రోడ్‌లో పనస పండ్లను గుట్టలుగా పోసి అమ్మకాలు చేస్తున్న ఉద్దానం రైతులు

● సమస్యలు పరిష్కరించకపోతే ధర్నా తప్పదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర, పక్కనే జనరల్ సెక్రటరీ మహంతి

అరసవల్లి: రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల తీరు దారుణంగా ఉందని, ప్రభుత్వ సిఫారసులను సైతం పట్టించుకోకుండా ఈఎన్‌సీ స్థాయి అధికారులు వ్యవహరిస్తున్న తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పీఆర్ డిప్లమో ఇంజినీరింగ్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కె.రవీంద్ర ప్రకటించారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో ఇంజినీర్లకు కేటాయించాల్సిన అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను ఇవ్వకుండా ఉన్నతాధికారులు ఇబ్బందులు పెడుతున్నట్లుగా ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల తీరు మారకపోతే త్వరలో ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి మాట్లాడుతూ ప్రభుత్వ సిఫారసుల మేరకు ఉన్నతాధికారులు స్పందించకపోతే నిరసన తప్పదని హెచ్చరించారు.

ఆ బడి రాజుల పాలన చూసింది. స్వాతంత్య్ర సంగ్రామ నినాదాలు విన్నది. భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చిన సందర్భానికి సాక్షిగా నిలిచింది. ప్రజాస్వామ్య యుగంలో తొలిసారి ఓటరుగా మారిన మందస వాసులకు వేదికనిచ్చింది. ఇన్నేళ్ల ప్రస్థానంలో వేలాది మంది మేధావులకు పురుడు పోసింది. 125 ఏళ్లుగా విజ్ఞాన కాంతులు వెదజల్లుతూనే ఉంది. మందసలోని శ్రీరాజా శ్రీనివాస మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల వైభవమిది. మందస రాజుల సుందర స్వప్నంగా ప్రారంభమైన పాఠశాల పూర్వ విద్యార్థుల సంకల్ప బలంతో పూర్వ వైభవం సాధించింది.

125 వసంతాలు

- 125వ వసంతంలోకి మందస ఎస్ఆర్ఎస్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాల
- ఐకానిక్ భవంతికి ఊపిరి పోసిన పూర్వ విద్యార్థులు
- 125 ఏళ్ల వేడుకకు సన్నాహకాలు



ఎస్ఆర్ఎస్ఎం జెడ్పీ హైస్కూల్

మందస: మందసలోని ఎస్ఆర్ఎస్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాల 125 ఏళ్ల వేడుకకు ముస్తాబవుతోంది. జమీందారుల పాలనలో పురుడు పోసుకున్న ఈ బడి ఈనాటికీ పచ్చగా విరాజిల్లుతోంది. 1901 మే 16న ఆనాటి గంజాం కలెక్టర్ హెచ్‌డీ టేలర్, మందస జమీందారు వాసుదేవ రాజమణిదేవ్ ఈ పాఠశాలకు పునాది వేశారు. నాటి శిలాఫలకం నేటికీ ఈ బడిలో భద్రంగా ఉంది. వాసుదేవ రాజమణిదేవ్ తర్వాత శ్రీనివాస రాజమణి దేవ్ పాలన సాగించారు. ఆయన 30 ఏళ్ల పాటు ఈ బడిని బ్రిటిష్ పరం కాకుండా కాపాడారు. 1930లో ఆయన చనిపోయాక.. 1932 సెప్టెంబర్ 21న స్కూల్‌ను ప్రభుత్వ పాఠశాలగా గుర్తించి శ్రీ రాజా స్కూలును శ్రీ రాజా శ్రీనివాస రాజమణిదేవ్ మెమోరియల్ బోర్డు హైస్కూల్‌గా మార్చారు. నాటి గంజాం జిల్లాలో ఇది రెండో హైస్కూల్ కావడం విశేషం.

ఎన్నెన్నో అనుభవాలు..

వందేళ్లకుపైబడిన ప్రస్థానంలో మందస హైస్కూల్ ఎన్నో అనుభవాలు మిగిల్చింది. ప్రధానంగా ఈ పాఠశాల ముందరి భవనం ఓ జ్ఞాపికగా మారింది. వందలాది తుఫాన్లను తట్టుకుని ఈ భవనం నిలబడింది. రాజులు కట్టించిన భవంతుల్లో ఇది మాత్రమే మిగిలింది. ఇక్కడ చదువుకున్న వారు దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. మండల వ్యాప్తంగా దశాబ్దాల పాటు ఈ పాఠశాల పెద్ద దిక్కుగా ఉండేది. బడి వదిలితే సాయంత్రం పూట మందస పట్టణమంతా కళకళలాడేది.



శంకుస్థాపన నాటి రాయి

పూర్వ విద్యార్థుల ఔదార్యం

కాలక్రమేణా పెంకులు ఊడిపోయిన దశలో ఐకానిక్ భవనం అందవిహీనంగా మారడం పూర్వ విద్యార్థులను కలిచివేసింది. ఎంతో వైభవం కలిగిన ఈ భవనాన్ని ఆ దశలో చూసి విద్యార్థుల గుండెలు చివుక్కుమన్నాయి. అంతే.. అంతా కలిశారు. ప్రభుత్వ సాయం కోరకుండా, అధికారుల కోసం ఎదురు చూడకుండా ఎవరికి తోచినంత డబ్బు వారు విరాళాల రూపంలో పోగు చేసుకున్నారు. బ్యాచ్‌ల వారీగా పోటీ పడి మరీ స్కూలు కోసం పూర్వ విద్యార్థులు విరాళాలు ఇచ్చారు. ఎక్కడెక్కడి వారో వాట్సాప్ వేదికగా ఒక్కటయ్యారు. దాదాపు రూ.27 లక్షలు సేకరించి ఐకానిక్ భవనానికి మళ్లీ కొత్త ఊపిరి పోశారు.

అ'పూర్వ' సమ్మేళనానికి సై..

భవన పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 19, 20 తేదీల్లో భవనాన్ని పునఃప్రారంభిస్తూ 125 ఏళ్ల వేడుక సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆహ్వాన పత్రాలు కూడా పంపిణీ చేయడం మొదలు పెట్టామని నిర్వాహకులు తెలిపారు. ఉన్నత పాఠశాల భవనాన్ని 19వ తేదీ ఉదయం 10 గంటలకు పునఃప్రారంభిస్తామని, మరుసటి రోజు ఆదివారం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు.

23న ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐలో రెండో విడత అడ్మిషన్ల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, అలాగే కొత్తగా దరఖాస్తు చేసుకోబోయే అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామమోహనరావు తెలిపారు. 23వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఐటీఐ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌పోర్టల్ ద్వారా సమర్పించవచ్చునని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) కోర్సు అందుబాటులో ఉందన్నారు. వీరికి పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్లుగా పనిచేసేందుకు అవసరమైన శిక్షణను ప్రత్యేకమైన మోడ్రన్ మిషన్లపై నేర్పిస్తారని పేర్కొన్నారు. రెండో విడత ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తుతోపాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఈ నెల 17 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. ఇంకా 250 మంది విద్యార్థులు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉందని గుర్తు చేశారు. సందేహాల నివృత్తి కోసం 9505161701, 9963945259, 9885960809 ఫోన్ చేయవచ్చన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల గృహదీక్ష



కోప్టలో గృహదీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: డీఎస్సీ-2003 ఫోరం పిలుపు మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 2003 బ్యాచ్ ఉపాధ్యాయులు గృహ దీక్ష చేప డుతున్నారని ఆపస్ మండల అధ్యక్షుడు జి.చి న్నికృష్ణంనాయుడు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెమో 57 మేరకు అర్హత కలిగిన అందరికి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే శాంతియుత నిరస నకు కుటుంబ సమేతంగా అందరూ హాజరుకా వాలని పిలుపునిచ్చారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

జి.సిగడాం: డి.ఆర్.వలసలో ఈ నెల 12న శనీ శ్వరుడి ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకో వాలని ఆలయం కమిటీ సభ్యులు, గ్రామస్తులు కోరారు. ఆదివారం ఆలయంలో విగ్రహాల పరి స్థితిని పరిశీలించారు. పోలీసులు పూర్తిస్థా యిలో దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని సర్పంచ్ కుమరాపు శ్రీనివాస రావు, ఎంపీటీసీ కుమరాపు రమేష్‌నాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ఆలయ శిల్పి కుమరాపు రామినా యుడు, కుమరాపు చిన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

సారవకోట : పెద్దలంబ పంచాయతీ కురమన్న పేటకు చెందిన కలుగు నారాయణరావు(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. సారవకోట మండలం నారాయణపురం నుంచి పాతపట్నం మండలం కొయ్యకొండ వెళ్లే మార్గంలోని మామిడి తోటలో మేకలు, గొర్రెలకాపరులు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. స్థానికులకు సమాచారమివ్వగా వారు సారవకోట పోలీసు లకు సమాచారమిచ్చారు. వ్యక్తి మృతిచెంది రెండు, మూడు రోజులు కావడంతో గుర్తుప ట్టలేని విధంగా మారింది. కొద్దిసేపటి తర్వాత కురమన్నపేటకు చెందిన నారాయణరావుగా అనుమానించి కుటుంబ సభ్యులకు సమాచార మందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. నారాయ ణరావుకు భార్య హిమవతి, కుమార్తెలు ఉష, లలిత ఉన్నారు. నారాయణరావు నిత్యం మద్యం సేవించి భార్యతో గొడవపడుతుం డేవాడు. దీంతో ఆమె కొన్నాళ్లుగా వేరుగా ఉం టోంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సారవకోట: అంగూరు గ్రామ సమీపంలో ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అద్దపనస గ్రామానికి చెందిన వెలమల రామారావు తీవ్ర గాయాల పాలయ్యాడు. చల్లవానిపేట నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న రామారావు గాయపడటంతో 108 వాహనంలో నరస న్నపేట ఆస్పత్రికి తరలించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

- అధికారి వేధింపులే కారణమంటున్న బంధువులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం-2లో పని చేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో సిలగాంకు బదిలీ అయిన ఉడుకుల రాంబాబు (44) ఆది వారం గుండెపోటుతో మరణించారు. ఆకస్మిక బదిలీ, ఒత్తిళ్లే ఇందుకు కారణమని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. రాంబాబు ఈ నెల 7 వరకు శ్రీకాకుళం బాలుర వసతి గృహం లోనే పనిచేశారు. వాస్తవంగా బదిలీ అయ్యే అవకాశం లేకపోయినా అక్కడి సంక్షేమాధికారి సిఫారసులు, వేధింపుల వల్ల రాంబాబును బదిలీ చేశారని, బదిలీ వద్దని ఎంత మొరపెట్టు కున్నా కనికరించలేదని బంధువులు చెబుతు న్నారు. వసతి గృహ సంక్షేమాధికారి చెప్పిన మాటలు విని వాస్తవిక పరిస్థితులు తెలుసుకో కుండా బీసీ సంక్షేమాధికారిణి అడ్డగోలుగా బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంబాబు స్వస్థలం విజయనగరం జిల్లా డెం కాడ మండలం పాలెం గ్రామం. భార్య రమాదే వి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

థర్మల్ ఉద్యమం @15 ఏళ్లు

- కోర్టు తీర్పులతో దిగివచ్చిన ప్రభుత్వాలు
- చిత్తడి నేలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- బీల ప్రాంతవాసుల కల సాకారం



సోంపేట బీల ప్రాంతంలో విలువైన చిత్తడి నేలలు



బీల ప్రాంతంలో థర్మల్ స్థూపం

సోంపేట: బీల ప్రాంతంలో చిత్తడి నేలల సంరక్షణే ధ్యేయంగా మొదలైన థర్మల్ ఉద్యమం నేటికీ 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. సోంపేటలోని బీల ప్రాంతం లో థర్మల్ విద్యుత్ కర్మాగారం నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిం ది. ప్లాంట్ నిర్మాణం జరిగితే తమ ఉనికికే ముప్పు తప్పదని భావించి ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమం ప్రారంభించారు. ఈ క్రమంలో 2010 జూలై 14న జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు పౌరులు మృతి చెందడంతో ఉద్యమం తీవ్రత ప్రపంచానికి తెలిసివచ్చింది. ఈ కాల్పులతో ఎం దరో ఉద్యమకారులు, పర్యావరణవేత్తలు బీల ప్రాంతాన్ని సందర్శించారు. మీ ఉద్యమంతో థర్మల్ విద్యుత్ కర్మాగారం నిలుపుదలే కాకుండా ప్రపంచంలో వెలకట్టలేని విలువైన చిత్తడి నేలలు సంరక్షించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి గత 15 సంవత్సరాలుగా చిత్తడి నేలల పరిరక్షణే ధ్యేయంగా పర్యావరణ పరిక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు, సోంపేట ప్రజలు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

విజయం దిశగా..

పర్యావరణవేత్తల కదలికతో సలీంలాలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ నేచరల్ హిస్టరీ (సాకాన్) సభ్యులు 2012లో బీల ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడి విలువైన చిత్తడి నేలలు గుర్తించారు. సాకాన్ నివేదికల ప్రకారం పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేసి పోరాటం చేశారు. చిత్తడి నేలలు సంరక్షించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు చట్టం తీసుకురావాలని కోర్టు ద్వారా తీర్పు వెలువడింది. కమ్యూనిటీ రిజర్వ్‌గా గుర్తించి మూడు నెలలకు ఒకసారి వివరాలు తెలియజే యాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభు త్వాలు కాలయాపన చేయడంతో పాటు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోలేదు. దీంతో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ, పర్యావరణ పరిర క్షణ సంఘ నాయకులు డాక్టర్ కృష్ణమూర్తి, మృ త్యుంజయరావు సుమారు నెల రోజుల క్రితం కోర్టులో కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పని పరిస్థితి ఏర్పడిం ది. చిత్తడి నేలల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చిత్తడి నేలల గుర్తింపు..

సోంపేట మండలంలోని బెంకిలి, రుషికుద్ద, బారువ, గొల్లగండి పంచాయతీల నుంచి తీర్మానాలు సేకరించారు. బెంకిలిలో 198 ఎకరాలు, రుషికుద్దలో 797 ఎకరాలు, బారువలో 227 ఎక రాలు, గొల్లగండిలో 249 ఎకరాలులో చిత్తడి నేలలు ఉన్నట్లు గుర్తించారు. నాలుగు పంచాయతీల పరి ధిలోని విలువైన చిత్తడి నేలలు ఆక్రమణలు గురికా కుండా, వ్యవసాయ అవసరాలు, చేపలు పట్టుకు నేందుకు వీలుగా అటవీ శాఖకు అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలు మేరకు మండల స్థాయి అధికారులు తీర్మానాలు సేకరించారు. దీంతో బీల ప్రాంతాన్ని రక్షించుకోవాలనుకున్న కల సాకారమైందని స్థాని కులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సంస్మరణ సభ..

పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు తెలిపారు. థర్మల్ స్థూపం వద్ద మృతులకు నివాళులు అర్పించి, అనంతరం బారువ గ్రామంలోని పూర్వవిద్యార్థుల సంఘ భవనం వద్ద సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సభకు బీల ప్రాంత ప్రజలు, మండలంలోని అన్ని సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిత్తడి నేలల పరిరక్షణే ధ్యేయం



సోంపేట మండలంలో కాకుండా రాష్ట్రంలోని చిత్తడి నేలలు సంరక్షణే ధ్యేయంగా ఉద్యమం కొనసాగుతుంది. చిత్తడి నేలలు ప్రకృతి, మాన వాళికి అందించిన విలువైన ఆస్తి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులు, ప్రభు త్వాలపై ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పం దించి దేశంలో విలువైన చిత్తడి నేలలు గుర్తించి వాటి రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

– డాక్టర్ కృష్ణమూర్తి, పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు

తూర్పుకాపు భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనెపు రామకృష్ణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సిక్కోలు జిల్లా తూర్పు కాపు సామాజికవర్గం భవన నిర్మాణానికి శ్రావణ మాసంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తు న్నట్లు సామాజికవర్గ ప్రతినిధులు రాడ కైలాసరావు, లంక గాంధీ, ఆనెపు రామకృష్ణ, ఇజ్జాడ శ్రీనివాస రావు, శాసపు జోగినాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన మందిర్‌లో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అత్య ధిక జానాభా కలిగిన తూర్పుకాపు సామాజికవర్గా నికి అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పిం చాలని కోరారు. పెద్దపాడు రోడ్డులో భవన నిర్మాణా నికి భూమిపూజ చేయడానికి సర్వం సిద్ధం చేశామ ని, విరాళాలు ప్రకటించిన రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు తక్షణమే తూర్పుకాపు సామాజిక వర్గం భవన్ పేరిట ఏర్పాటుచేసిన ఖాతాలో జమ చేయాలని కోరారు. సమావేశంలో తూర్పుకాపు ఉద్యోగుల సంఘం నాయకులు కిల్లారి నారాయణరావు, వాళ్ళ శ్రీరాములునాయుడు, అం కడాల తవిటన్న, కరణం చిన్న వెంకటరమణ, పతి వాడ సురేష్, కురిటి దుర్గారావు, ఎస్.సత్యనారా యణ, వాళ్ళ సన్యాసినాయుడు, పిల్లా తిరుపతి రావు, దన్నాన మోహనరావు, దోల బాలకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.

నేరప్రవృత్తికి స్వస్తి పలకండి




రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: నేర ప్రవృత్తికి స్వస్తిపలికి సత్ప్రవర్త నతో నడుచుకోవాలని, గొడవలు, నేరాలకు దూరంగా ఉండాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆది వారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌తోపాటు జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు, నేర చరిత్ర గలవారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిం చారు. చట్టాన్ని అతిక్రమించి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

మశాఖపురంలో.. షాడో సర్పంచ్ పెత్తనం

- తల్లి సర్పంచ్‌గా ఉన్నా కొడుకు చెబితేనే పనులు
- రేషన్ కార్డు దరఖాస్తుల్లో ఆయన సంతకం తప్పనిసరి
- జల్‌జీవన్ మిషన్ కుళాయి నీటికీ అక్రమ వసూళ్లు
- చేతులెత్తేసిన పంచాయతీ సిబ్బంది



సర్పంచ్ లెటర్ ప్యాడ్‌పై రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారు (వృత్తంలో సర్పంచ్ స్టాంప్‌పై షాడో సర్పంచ్ సంతకం)



మశాఖపురంలో ఇంటింటికి కుళాయి

ఇచ్ఛాపురం రూరల్ : కూటమి నాయకుల కక్షసాధిం పుల పర్వం కొనసాగుతోంది. తన మాటే శాసనం, పంచాయతీలో తాను చెప్పినట్లు నడుచుకోకపోతే తాట తీస్తానంటూ ఓ షాడో సర్పంచ్ ప్రజల్ని భయ భ్రాంతులకు గురిచేస్తున్నాడు. అధికారాన్ని పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుని ఆయనకు అధికారులు సైతం సలాం కొడుతుండటం గమనార్హం. ఇచ్ఛా పురం మండలం మశాఖపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు మహిళ గెలుపొం దారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు పంచాయతీ పాలన సాఫీగానే సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసలు కథ మొదలైంది. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన సర్పంచ్ కుమారుడు షాడో సర్పంచ్‌గా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడు. జగనన్న కాలనీ నిర్మాణం సమ యంలో నీటి కోసం విద్యుత్ బోరును ఏర్పాటు చేస్తే, దానికి సంబంధించి విద్యుత్ వైరును తొలగించడం తో అప్పటి ఆర్డీఓ కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తానం టూ హెచ్చరించడంతో కాస్త వెనక్కి తగ్గాడు. దళితుల ఇళ్లకు దారి లేకుండా శివాలయానికి వాస్తు దోషం పేరుతో రక్షణ గోడ నిర్మించేందుకు దళితుల ప్రహ రీని కూలదోయడంతో డీఎస్పీ విచారణ, హెచ్చరి కతో దాన్నీ విరమించుకున్నాడు. అక్కడితో ఆగకుం డా పదేళ్లుగా సామాజిక భద్రతా పింఛన్ పొందుతున్న ఐదుగురు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై వ్యక్తి గత కక్ష పెంచుకొని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌కు చెప్పి కూటమి ప్రభుత్వంలో పింఛన్ నిలిపివేయడం లో కీలక పాత్ర పోషించాడు.

సంతకం పెడితేనే..

తాజాగా మరో అడుగు ముందుకు వేసిన ఈ షాడో సర్పంచ్ అధికారులను శాసించే స్థాయికి ఎదిగిపో యాడు. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ వద్దకు వెళ్లే ముందు లబ్ధిదారులు తనకు దరఖాస్తు చేసుకొని, సర్పంచ్ లెటర్ ప్యాడ్‌పై తన సంతకం పెడి తేనే చేర్పులు, మార్పులు చేయాలంటూ సచివా లయం అధికారులకు ఆదేశాలు జారీ చేయడం గమ నార్హం. దీంతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు రేషన్ కార్డుకు దరఖాస్తు కోసం వెళ్తుంటే చుక్కలు చూపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. తన తల్లి సర్పంచ్‌గా ప్రస్తుతం కొనసాగుతుంటే.. ఈ షాడో సర్పంచ్ తానే సర్పంచ్‌ను అంటూ సర్పంచ్ లెటర్ ప్యాడ్‌పై ఏకంగా తన సంతకాన్ని పెట్టడం విశేషం.

కుళాయికి రూ.30 కట్టు..

గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకం లో భాగంగా గ్రామంలో ఇంటింటికీ కుళాయి వేయడంతో తమకు తాగునీటి కష్టాలు తప్పాయం టూ గ్రామస్తులు సంతోషపడ్డారు. ఇంతలో ప్రతి కుళాయికి నెలనెలా రూ.30 చొప్పున వసూలు చేయా లంటూ సర్పంచ్ ఆదేశాలు జారీ చేశారంటూ ఇటీ వల గ్రీన్ అంబాసిడర్ ద్వారా మైక్‌లో వీధుల్లో అనౌ న్స్‌మెంట్ చేయడంతో స్థానికులు అవాక్కయ్యారు. జేజేఎల్ఎం పథకం ద్వారా ఉచితంగా మంచినీరు వస్తుందని చెప్పిన వారు ఇప్పుడు నెలనెలా రూ.30 చొప్పున ట్యాక్స్ వసూలు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కలెక్షన్లు మొదల య్యాయని స్థానికులు చెబుతున్నారు.

మాకు సంబంధం లేదు..

మా డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం జేజేఎల్ఎం ద్వారా ప్రజలకు పూర్తి ఉచితంగా తాగునీరు అందిస్తుంది., ప్రైవేటు వ్యక్తుల వసూలుకు, తమ శాఖకు సంబంధం లేదు.

– కూన విష్ణుమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

నాయకులకు ప్రమేయం లేదు..

రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, కొత్త కార్డుల కోసం నేరుగా గ్రామ సచివాలయం డిజిటల్ అసి స్టెంట్‌కు దరఖాస్తు చేసుకుంటే వీఆర్వో విచారణ చేస్తారు. ఇందులో మధ్యవర్తులు, రాజకీయ నాయకులకు ప్రమేయం లేదు. సర్పంచ్‌ల సం తకాలను ఇతరులు ఫోర్జరీ చేయడం నేరం.

– కె.రామారావు, ఇచ్ఛాపురం ఎంపీడీఓ

ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో నిర్వాహకులు, అతిథులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. జిల్లా కేంద్రంలోని శాంతినగ ర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో రెం డు రోజులగా జరుగుతున్న జీఎస్‌వీ జ్యూయలర్స్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా ఎ.అభిరామ్(ఎ స్‌సీఐబీసీ), రన్నరప్‌గా కె.సాయికుమార్(శ్రీకాకు ళం) నిలిచారు.పురుషుల డబుల్స్ విభాగంలో కె.సాయికుమార్-వంజరాపు ప్రవీణ్ (ఎస్‌సీఐబీసీ) చాంపియన్స్‌గా నిలవగా, ఎం.ప్రకాష్-ఎస్.శివ జంట రన్నరప్‌గా నిలిచింది. మహిళల సింగిల్స్‌లో సీహెచ్ మోక్షజ్ఞ విజేతగా నిలవగడా, కె.చందన రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అండర్-19 బాలుర సింగిల్స్‌లో ఎ.అభిరామ్(ఎస్‌సీఐబీసీ) చాంపియ న్‌గా, వంజరాపు ప్రవీణ్ (పాతపట్నం) రన్నరప్‌గా నిలిచారు. అండర్-19 బాలికల సింగిల్స్‌లో విజే తగా సీహెచ్ మోక్షజ్ఞ (ఆర్టీసీ), బి.సాయిలక్ష్మి(పలాస) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. అండ ర్-11, 13, 15, 17 వయో విభాగాల్లో శ్రీకాకుళం, పలాస, కవిటి, పాతపట్నం, టెక్కలి, సోంపేట, రాజాంకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటారు.

బహుమతులు ప్రదానం..

విజేతలకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు ముఖ్య అతి థిగా హాజరై విజేతలకు బహుమతులు అందజే శారు. రెండు రోజుల టోర్నీ వివరాలను బ్యాడ్మిం టన్ జిల్లా కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ సంపతిరావు సూరిబాబు వివరించారు. కార్యక్ర మంలో స్పాన్సర్లు, మ్యాచ్ పాయింట్ అకాడమీ(హై దరాబాద్) ప్రతినిధి ఎల్.కుషి, జీఎస్‌వీ జ్యూయ లర్స్ సంస్థ ఉన్న కిరణ్‌కుమార్, నారాయణశెట్టి వెంకటకిరణ్‌కుమార్, కె.రమణ, జి.భీమారావు, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు మెట్ట అశోక్‌కు మార్, బి.దామోదరరావు, ఎంఎం విలేకర్, మదినా శైలానీ, ఎంతు రత్నాజీరావు, జి.ప్రసాద్, వివి కవీశ్వరరావు, అనీల్‌కుమార్, శాంతికుమార్, జయరాం, సంతోష్, రిజిస్ట్రార్ డాక్టర్ గురుగుబెల్లి రాజు, కె.రాఘవరావు, కె.కిరణ్, భైరి మాధురి, రిఫ రీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎం పిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకా కుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా జిల్లాస్థాయి సబ్-జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. స్విమ్మింగ్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ ఎం పికలను కోచ్ మురళీధర్, అంతర్జాతీయ వెటరన్ స్విమ్మర్ ఎస్.కాంతారావు పర్యవేక్షించారు.

19, 20 తేదీల్లో విశాఖలో రాష్ట్రపోటీలు..

ఈ సందర్భంగా హారికాప్రసాద్ మాట్లాడుతూ ఎం పికైన క్రీడాకారులను ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖ పట్నంలోని ఆక్వా స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఏసీబీ సీఐ భాస్కర్ మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసు కుంటూ పోటీల్లో తుది వరకు పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ఝాన్సీ, జిల్లా ఉపాధ్యక్షులు రాజారత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కాంతా రావు, కోచ్ మురళి, క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే:

పి.అవినాష్, టి.ప్రేమ్‌కుమార్, పి.సమీర్‌సుదీప్, సీహెచ్ సుశాంత్, పి.మనోజ్, ఎం.రోహన్‌శ్రీవస్తవ్, వి.స్మృతిక, వి.జశ్వంత్, వి.జాన్విక, పి.చేతన, పి.హర్షిత, పి.ఇషాసంహిత, టి.జవహర్‌రాజ్.

అన్ని మండలాల్లో శిష్టకరణ సంఘాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

గార: జిల్లాలో అన్ని మండలాల్లోనూ శిష్టకరణ సం ఘాలను ఏర్పాటు చేసి జిల్లా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. ఆది వారం శ్రీకూర్మం జంక్షన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే చాలా మండలాల్లో కొత్త కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహించామని, త్వరలో మిగిలిన మండలాల్లో ఎన్నికలు జరిపిస్తామన్నారు. జిల్లాలోనే ఆదర్శవంతంగా గార మండల శిష్టకరణ సంఘం సేవలందిస్తుందని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ మాట్లాడుతూ సంఘంలో సేవ చేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉం టుందన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో గార మండల తహశీల్దార్ మునగవ లస చక్రవర్తి, జిల్లా సంఘ గౌరవాధ్యక్షుడు బలి వాడ మల్లేశ్వరరావు, కోశాధికారి బలివాడ శివ ప్రసాద్, ముఖ్య నాయకులు ఆర్‌వీఎస్ శర్మ, గజరావు వెంకటమురళీకృష్ణ, న్యాయ సలహాదా రుడు నౌపడ విజయ్‌కుమార్, కరకవలస సౌజన్య పట్నాయక్, గార మండల సంఘ అధ్యక్ష కార్యదర్శులు శాలిహుండం రామకృష్ణ, కేఎస్‌ఆర్ పట్నాయక్, కోశాధికారి దాసుమహంతి వెంకట రావు, మాజీ ఎంపీటీసీ చంద్రమహంతి శ్రీదేవి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.


బాలియాత్ర నిర్వహణకు కమిటీ



శ్రీముఖలింగం ఆలయ ఆవరణలో బాలియాత్ర కమిటీ సభ్యులు

జలుమూరు: రాష్ట్ర పండగగా బాలియాత్ర నిర్వహిం చేందుకు కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు యాత్ర కమిటీ ప్రతినిధి డాక్టర్ దువ్వాడ జీవితేశ్వ రరావు తెలిపారు. బాలియాత్ర నిర్వహణకు సం బంధించి ఆదివారం 20 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీముఖలింగం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ కటక్‌లో కార్తీక పౌర్ణమి నుంచి వారం రోజుల పాటు యాత్ర జరగ నుందని, శ్రీముఖలింగంలో ఏ తేదీన నిర్వహించా లనే విషయమై వారంలో నిర్ణయం తీసుకుం టామని చెప్పారు. యాత్ర విజయవంతం చేసేం దుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు భాగ స్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో సర్పం చ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ టి.బలరాం, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు బి.వి.రమణ, తేజేశ్వ రరావు, వేణు, చింతాడ వెంకటరావు, ఉపాధ్యాయులు, అర్చకులు పాల్గొన్నారు.

బ్రిటీష్ కాలం నాటి రైల్వేవంతెన తొలగింపు



క్రేన్ సాయంతో పాత వంతెనను తొలగిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: మారు తున్న కాలం, టెక్నాలజీ అం దిపుచ్చుకుంటున్న భారత రైల్వే కొత్త బాటలో పయని స్తోంది. పాతవి జ్ఞాపకాలే అయినా ప్రజలకు చేరువ య్యేలా సేవలు అందించా లన్నది లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా బ్రిటీష్ కాలం నాటి కట్టడాలను తొలగి స్తోంది. ఈ క్రమంలో ఆది వారం వజ్రపుకొత్తూరు మండలం పూండి రైల్వే స్టేషన్‌లో భారీ క్రేన్‌ల సాయంతో పాత కాలినడక వంతెనను తొలగించే పనులు చేపట్టింది. కేవలం 8 గంటల్లోనే వంతెన మొత్తాన్ని విడిభాగాలు చేసి తొలగించింది. కింది భాగంలో 25వేల కిలోవాట్‌ల విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా పనులు పూర్తి చేశారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో చివరి స్టేషన్‌గా ఉన్న పూండికి వాల్తేరు డివిజన్ నుంచి ప్రధాన ఇం జినీర్లు, టెక్నికల్ బృందం వచ్చి తొలగింపు పనులు చేప ట్టారు. వంతెన తొలగింపునకు ముందే మూడు నెలలు కిం దట సమాంతరంగా కొత్త వంతెన నిర్మించారు.